TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

సంపుటి : 3 సంచిక : 224 | గురువారం 06-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...



## క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

- మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణ.
- డీప్‌ఫేక్, జూగావీ కంటెంట్ నియంత్రణలో లోపాలు అంగీకారం.
- కేంద్ర ఐటీ శాఖ అధికారులతో మెటా ప్రతినిధుల కీలక సమావేశం.
- ప్రధాని మోదీ "జెన్ జీ" వీడియో తొలగింపుపై వివరణ కోరిన అధికారులు.
- సమావేశం అనంతరం జుకర్‌బర్గ్ క్షమాపణ తెలిపినట్లు సమాచారం.

2లో

## డాక్టర్ టోకెన్ కోసం 5 ఆన్‌లైన్ పేమెంట్..

### 8.18లక్షలు హాంఫట్!



- డాక్టర్ అపాయింట్‌మెంట్ పేరుతో మహిళను టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు.
- రూ.5 యూపీఐ టోకెన్ చెల్లింపు చేయించిన తర్వాతఇూాఖ ఫైల్ ఇన్‌స్టాల్ చేయించారు.
- మహిళ బ్యాంకు ఖాతా నుంచి రూ.8,18,405 అక్రమంగా డెబిట్.
- ఘటన మహారాష్ట్రలోని ఠాణే జిల్లా కల్యాణ్‌లో జరిగింది.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

## తెలంగాణ-మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయండి

- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- పీఎంకు రాసిన లేఖ... పీఎంవో స్పందనపై చర్చ..
- చర్చల పక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్ హామీ



2లో..

ప్రాణహితనదిపైతుమ్మిడిహెట్టిబ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావంపెద్దగా ఉండదని వివరించారు. జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన కార్యాలయంలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్శక్తికి పంపిన లేఖ విషయాన్నిముఖ్యమంత్రి జల్‌శక్తి మంత్రితో ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రికి గుర్తు చేశారు.

తుమ్మిడిహెట్టివద్ద148మీటర్ల నుంచి 152మీటర్లవరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. అధ్యయనం ప్రకారం 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. ముంపులోనూ 50 శాతం నదీగర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు సీఎం వివరించారు. 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితేగ్రావిటీద్వారా కావల్సినంత నీరు సరఫరాచేయలేమని, కాబట్టి150 నుంచి 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను సీఎం కోరారు. తుమ్మిడిహెట్టివద్ద150 నుంచి 152మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు

## భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

### పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పేజి 2లో

### తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు

## రద్దుచేసే కుట్ర



- గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఎపికి అనుకూల నిర్ణయాలు
- 18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి హరీష్ రావు

2లో

## మత్స్యకారులకు చారిత్రక భరోసా

### బీమా, సబ్సిడీ, భృతిలో కూటమి ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలు



- గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బీమా పరిహారాలన్నీ చెల్లింపు
- విద్యుత్ సబ్సిడీలో భారీ పెంపు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

మత్స్యకారుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రతి అంశంలోనూ న్యాయం చేస్తూ, మత్స్యకార కుటుంబాలకు నిజమైన భరోసా కల్పిస్తున్నామన్నారు. మాటల్లో కాదు... చేతల్లో సంక్షేమాన్ని చూపించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ విధానమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మత్స్యకారుల బీమా పరిహారాలను పూర్తిగా చెల్లించడంతో పాటు, బీమా పథకాన్ని విస్తరించడం, విద్యుత్ సబ్సిడీని గణనీయంగా పెంచడం, వేట నిషేధ కాల భృతిని భారీగా పెంచి అందించడం వంటి అనేక చారిత్రక నిర్ణయాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గణాంకాలే కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, గత ప్రభుత్వ వైఫల్యాలకు ప్రత్యక్ష సాక్ష్యాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

పేజి 2లో

### గోదావరి పుష్కరాలు -2027

## ఏర్పాట్లపై సమీక్ష



గోదావరి పుష్కరాలు -2027 ఏర్పాట్లపై రాష్ట్ర సచివాలయం నుండి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్,గోదావరి పుష్కరాల ప్రత్యేక అధికారి ,వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ లతో కలిసి బుధవారం సంబంధిత శాఖల అధికారులు,

పేజి 2లో

## కట్టుకథలతో ఆరోపణలు చేయడమే హరీశ్‌రావు పని: మంత్రి ఉత్తమ్



- హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ ఆరోపణ.
- తెలంగాణ ప్రాజెక్టులను 12 ఏళ్లుగా ఏపీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని వ్యాఖ్య.
- సమ్మక్క సాగర్‌కు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడి.
- సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఏపీ అభ్యంతరాలను అధిగమించి అనుమతులు సాధించామని మంత్రి.

హైదరాబాద్: తెలంగాణ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం 12 ఏళ్లుగా వ్యతిరేకిస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పరోక్షంగా ఆ రాష్ట్ర ప్రాజెక్టులకు మద్దతిచ్చిందని చెప్పారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

పేజి 2లో

### 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ

## అన్యాయం జరగదు

### కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు



- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి
- అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి
- జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ

పేజి 2లో

# సంపాదకీయం

## బంకీపూర్: మోదీ సర్కార్‌కు మరో పాఠం

కాక్రోచ్ జనతా పార్టీ పేరిట దేశ రాజధాని ఢిల్లీలో వేలాది విద్యార్థులు, ఇతరేతర శక్తులు రగిల్చిన ఆందోళన చల్లారి వారం రోజులు దాటినప్పటికీ దాని ప్రకంపనలు ఇంకా సమసిపోలేదు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత పరిస్థితి పూర్తిగా సద్దుమణగడం లేదు. విద్యార్థులపై లాఠీచార్జి, పెల్లెట్లను ప్రయోగించినందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ పార్లమెంటును ప్రతిపక్షాలు స్తంభింపజేస్తున్నాయి. చిన్నా చితక బిల్లులు తప్ప కీలక బిల్లులను ప్రవేశ పెట్టలేకపోతున్న ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలో పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులపై లాఠీచార్జి దృశ్యాలు మాకెందుకు చూపిస్తున్నారు.. మా టైమ్ వేస్ట్ చేయకండి.. అని రెండు వారాల క్రితం వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వానికి వీలు కల్పిస్తున్నారు. కేంద్రమే ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించినందువల్ల తలెత్తుకుని తిరిగే దారి ప్రభుత్వానికి ఆయన కల్పిస్తున్నట్లున్నారు. ఒకవైపు తన అభిమానులు, బీజేపీ నేతలు విద్యార్థులను రకరకాల పదజాలంతో దూషిస్తున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో పెద్ద హృదయంతో వారిని తాను క్షమించానని ప్రకటించారు. అయినా ఈ ప్రకటన అనుకున్నంత సానుకూల ఫలితాలు ఇవ్వలేదు. పార్లమెంటుకు మోదీ, అమిత్ షాలు వస్తున్నారే కానీ ఉభయ సభలకు హాజరయ్యే సావకాశం వారికి లభించడం లేదు. ఆశ్చర్యకరమైనదేమంటే హోంమంత్రి అసలు నార్త్ బ్లాక్ (హోం మంత్రిత్వశాఖ నెలవు)కే రావడం లేదని, ఒకటి రెండు ముఖ్యమైన సమావేశాలు పార్లమెంటులో తన గదిలోనే నిర్వహిస్తున్నారని అధికారులే చెబుతున్నారు. ఈ సంక్షోభ సమయంలో మోదీని బాగా సంతోషపెట్టిన ఘటన ఒకటే. అది-- ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా ఆయనను నృత్యగీతాలతో, ప్రశంసల కుంభవృష్టితో అలరించడం! మళ్లీ ఢిల్లీ తిరిగి రాగానే పరిస్థితిలో అదే వేడి!

ఈ సంక్షుభిత సమయం ఎంతకాలం ఉంటుందో తెలియదు కానీ, ఇదే సమయంలో వచ్చిన మూడు అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలలో రాబోయే మార్పును సూచిస్తున్నాయని అనేక మంది పరిశీలకులు చెబుతున్నారు-- ముఖ్యంగా బిహార్‌లోని బంకీపూర్ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలు. బిహార్ రాజధాని పాట్నా సాహెబ్ లోక్‌సభా పరిధిలో ఒక నియోజకవర్గమైన బంకీపూర్ కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనకు కేంద్రంగా మారింది. ఇటీవల నీట్ ప్రశ్నపత్రాల లీక్ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో విద్యార్థులు వీధుల్లోకి రాగా, పాట్నాలో దాని ఉధృతి తీవ్రంగా కనిపించింది. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ బంకీపూర్‌లో కేంద్రీకృతమైన కాలేజీల్లో, హాస్టళ్లలో ఉన్న వేలాది విద్యార్థులు ఊరేగింపుగా దూసుకువచ్చారు. సిటీలో విద్యార్థులు కోచింగ్ తీసుకునే కేంద్రాలు అధికంగా ఉన్న అశోక్‌రాజ్‌పథ్, బోరింగ్ రోడ్లలో జనజీవనం స్తంభించిపోయింది. సివాన్, ఇతర కీలక జిల్లాల్లో నిరసన హింసాత్మకంగా మారింది. లాఠీచార్జిలు రాళ్లు రువ్వడం, బాష్పవాయువు, నీటి క్యానన్లను ప్రయోగించడం, పోలీసు జీపులను దహనం చేయడం, జాతీయ రహదారులను దిగ్బంధనం చేయడం వంటి సంఘటనలు జరిగాయి. ఏకే--47తో కాల్పులు జరపడంతో విద్యార్థులు గాయపడ్డ వీడియోలు

### తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు

# రద్దుచేసే కుట్ర

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించిన తర్వాత వాటిని సమీక్షించి రద్దు చేసిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్ రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో సాధించిన తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే దిశగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అజెండా రూపొందుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానికి పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఒక ఉద్యమకారుడిగా ఈ పరిణామాలను చూస్తుంటే తనకు కడుపు రగులుతోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఏపీకి ఎక్కడిదని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టాడు.కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి.. తెలంగాణ నోటికాడ ముక్క లాక్కోండని ప్రతిపాదించారు. దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నారు. ఈనెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశం అజెండాపై హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులను సమీక్షించాలని జిఆర్ఎంబి సమావేశ అజెండాలో చేర్చారని ఆరోపించారు. అజెండా వచ్చి వారం రోజులు గడిచినా ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు. ఏడు ప్రాజెక్టులకు వచ్చిన అనుమతులు రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం అడిగితే అజెండాలో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. ఏపీ కోసమే అజెండా ఉన్నట్లు కనిపిస్తోందని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించడం లేదని ఏపీ ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ ఇటీవల తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవాలని కేంద్రానికి ఏపీ ప్రభుత్వం లేఖ రాసిందని హరీశ్ తెలిపారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేందప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధప్రదేశ్‌కు ఎక్కడిది. ఇది ఎజెండాలో పెట్టే జీఆర్ఎంబీకి ఎక్కడిది..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలను మేం అనుమతులు తెచ్చినమన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా మీకు క్లియరెన్స్‌లు తేలేదు. మీరొచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే ఎజెండా వచ్చింది. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2022 ఆగస్టు 25న ఎంతో కష్టపడి సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించిందని హరీశ్ రావు గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఆ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఉరి వేసేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా 47 టీఎంసీల సమ్మక్క సాగర్ ప్రాజెక్టును వదులుకోవాలని ఆంధప్రదేశ్ కోరగా, తెలంగాణ ప్రభుత్వం దానికి అంగీకరించిందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నీళ్లు వాస్తవానికి ప్రస్తుత ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సొంత నియోజకవర్గమైన హుజూర్ నగర్‌కు వెళ్తాయని, అయినా కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తాము ఈ అంశాన్ని లేవనెత్తిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖ రాయడం వారి దివాలాకోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి..

మొదటిపేజీ తరువాయి

గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంతత్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్యసమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రధానమంత్రికార్యాలయం నుంచి లేఖ అందిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలోసమావేశం ఏర్పాటు చేసి తొలుత తెలంగాణ, మహారాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియప్రారంభిస్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డికి తెలియజేశారు. ఆ తర్వాత తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తాననిజల్‌శక్తి మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లురవి, వేంనరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వప్రత్యేకప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారుఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ.శ్రీధర్ పాల్గొన్నారు.

# మత్స్యకారులకు చారిత్రక భరోసా

మొదటిపేజీ తరువాయి

మత్స్యకారులకు నిజమైన మేలు జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వాల హయాంలోనే జరిగిందని, మత్స్యకారుల సంక్షేమాన్ని రాజకీయాల కోసం కాకుండా బాధ్యతగా భావించి పనిచేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలా నిరాశపరిచింది. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు అందాల్సిన బీమా పరిహారాలు, నష్టపరిహారాలను సైతం చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. కుటుంబ పెద్దను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవాల్సిన సమయంలో కూడా ఆ ప్రభుత్వం మానవత్వం చూపలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బీమా పరిహారాలన్నింటినీ చెల్లించి బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాం. ఈ బీమా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,56,66,000, కేంద్ర ప్రభుత్వం రూ.4,20,00,000 వెచ్చిస్తూ, మొత్తం రూ.6,76,66,000తో మత్స్యకార కుటుంబాలకు రక్షణ కల్పిస్తోంది. అంతేకాదు, కేవలం సంప్రదాయ మత్స్యకారులకే కాకుండా అర్హులైన మత్స్యరంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకువచ్చి, వారి కుటుంబాలకు భరోసా కల్పించే చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. గత ప్రభుత్వంతో పోలిస్తే మత్స్యకారుల బీమా పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, గతంలో 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మత్స్యకారులకు మాత్రమే బీమా వర్తించేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వయోపరిమితిని 18 నుంచి 70 సంవత్సరాలకు పెంచి మరింత మంది మత్స్యకారులకు భరోసా కల్పించామని చెప్పారు.గతంలో ఈ పథకం కేవలం సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ప్రస్తుతం సముద్ర మత్స్యకారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో చేపల వేట, చేపల పెంపకంపై ఆధారపడిన మత్స్యకారులకు కూడా బీమా వర్తించేలా విస్తరించామని మంత్రి వివరించారు. గతంలో సుమారు 1.30 లక్షల కుటుంబాలకు మాత్రమే రూ.5 లక్షల బీమా సౌకర్యం అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం పథకాన్ని విస్తరించి సుమారు 8 లక్షల మంది వరకు బీమా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వంలో వేట చేస్తున్న సమయంలో మరణించినప్పుడే రూ.5 లక్షల బీమా పరిహారం లభించేదని, కానీ కూటమి ప్రభుత్వం ఆ పరిమితిని తొలగించి ఫిషింగ్ కార్యకలాపాల్లో ఉన్న సమయంలోనైనా, ఇంటి వద్ద ఉన్నప్పుడైనా, ఏ కారణంతో మరణించినా అర్హులైన మత్స్యకార కుటుంబాలకు రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందేలా చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. గతంలో ఈ పథకం ప్రత్యక్షంగా చేపల వేటలో పాల్గొనే మత్స్యకారులకు మాత్రమే పరిమితమై ఉండేదని, ఇప్పుడు రొయ్యల పరిశ్రమలు, ఫీడ్ పరిశ్రమలు, రొయ్యలు, చేపల చెరువులు తదితర మత్స్యరంగ అనుబంధ వృత్తుల్లో పనిచేస్తున్న కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్నప్పటికీ, మత్స్యకారులు, మత్స్యరంగ కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా రూ.6.82 కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మందికి బీమా రక్షణ కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

### గోదావరి పుష్కరాలు -2027

# ఏర్పాట్లపై సమీక్ష

మొదటిపేజీ తరువాయి

ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా స్నాన ఘాట్ల ఏర్పాట్లు, ఘాట్లలో మౌలిక సదుపాయాలు, ఆయా ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి, రవాణా, భద్రత, తదితర ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల ఉన్నతాధికారులు సమర్పించిన ప్రతిపాదనలపై సమీక్షించారు.ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సందర్భంగా జిల్లాలో 28 స్నాన ఘాట్ల ఏర్పాటుకు గుర్తించామన్నారు. పోలవరం లో 20, కుక్కునూరు లో 3, వేలేరుపాడులో 5 ఘాట్ల ఏర్పాటు, ఆయా ఘాట్లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

# భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

మొదటిపేజీ తరువాయి



ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# క్షమాపణ చెప్పిన మార్క్ జుకర్‌బర్గ్

మొదటిపేజీ తరువాయి

మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పారు. డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి, చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ కంటెంట్ , ప్లాట్‌ఫామ్ నిర్వహణలో పొరపాట్లను అంగీకరించిన ఆయన.. క్షమాపణ చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

అంతకుముందు మెటా (వీమ్ఘ) ప్రతినిధులు.. కేంద్ర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి మెటా తరఫున చీఫ్ గ్లోబల్ అఫైర్స్ ఆఫీసర్ జోయెల్ కాప్లన్‌తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో ప్రధాని మోదీ (గ్రావీ వీశీఁఱ) "జెన్ జీ" అవుట్‌రీచ్ వీడియో తొలగింపునకు గల కారణాలపై నిలదీసినట్లు తెలిసింది. అలాగే అభ్యంతరకర కంటెంట్ నియంత్రణలో మెటా వ్యవహరిస్తున్న తీరుపైనా వివరణ కోరినట్లు సమాచారం. ఈ సమావేశమైన కొద్ది సేపటికే మెటా అధినేత నుంచి క్షమాపణ ప్రకటన వచ్చింది.

# డాక్టర్ టోకెన్ కోసం 5 ఆన్‌లైన్ పేమెంట్..

మొదటిపేజీ తరువాయి

వైద్యుడిని కలిసేందుకు ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించిన ఓ మహిళ సైబర్ మోసానికి గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌లో చేసిన సూచన మేరకు డాక్టర్ టోకెన్ కోసం రూ.5 యూపీఐ పేమెంట్ చేసి తన ఖాతా నుంచి ఏకంగా రూ.8.18లక్షలు పోగొట్టుకున్నారు. మహారాష్ట్రలోని ఠాణే జిల్లా కల్యాణ్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. వైద్యుడి కాంటాక్టు వివరాల కోసం ఓ మహిళ ఆన్‌లైన్‌లో శోధించారు. ఈ క్రమంలో అపాయింట్‌మెంట్ కోసం ఓ మొబైల్ నంబర్‌కు డయల్ చేశారు. లైన్‌లో ఉన్న ఓ వ్యక్తి హిందీలో మాట్లాడుతూ.. డాక్టర్‌గా పరిచయం చేసుకున్నాడు. ఆమె వాట్సప్ నంబర్‌ను తనకు పంపాలని, ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని సూచించాడు. దీంతో అతడు చెప్పినట్టే ఆమె చేశారు.

దీంతో పాటు ఓ ఏపీకే ఫైల్‌ను కూడా పంపి యూపీఐ ద్వారా తొలుత రూ.5 చెల్లించాలని కోరగా.. ఆమె అలాగే చేశారు. అనంతరం జులై 30న ఆమె తన అపాయింట్‌మెంట్ కోసం ఆస్పత్రికి వెళ్లగా.. అక్కడి సిబ్బంది సిస్టమ్‌లో చెక్ చేసి ఆమె పేరుతో ఎలాంటి బుకింగ్ లేదని చెప్పారు. అలాగే, ఆమె కాంటాక్టు చేసిన నంబర్లు నకిలీవని తేల్చడంతో అసలు మోసం బయటపడింది. ఈ క్రమంలోనే తన మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసిన ఏపీకే ఫైల్ కారణంగా తన ఖాతా నుంచి ఆగస్టు 2న రూ.8,18,405 డెబిట్ అయినట్లు ఆమె గుర్తించారు. అప్పటికే భారీగా మోసపోయానని గుర్తించిన ఆమె పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కట్టుకథలతో ఆరోపణలు చేయడమే హరీశ్‌రావు పని: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి

"బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదు. అధికారం కోల్పోవడంతో హరీశ్‌రావు ఆరోపణలు చేస్తున్నారు. ఏపీకి అమ్ముడుపోయి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు. కట్టుకథలతో ఆరోపణలు చేయడమే ఆయన పని. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని ఏపీ ప్రతిసారి కోరుతూ వచ్చింది. అనుమతులు వచ్చాక కూడా సమీక్షించాలని ప్రస్తావిస్తూనే ఉంది. నీటి పంపిణీ కోసం ఒప్పందం లేదా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆనాడు బీఆర్ఎస్ కోరింది. ఇప్పటి వరకు ట్రైబ్యునల్ ఏర్పడకుండా సమయస్ఫూర్తితో అడ్డుకున్నాం.

సమ్మక్క సాగర్ విషయంలో ఛత్తీస్‌గఢ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం సంప్రదింపులు జరపలేదు. ఆ రాష్ట్రం నుంచి ఎన్‌వోసీ కోసం మేం ప్రయత్నిస్తున్నాం.. నెలాఖరులో ఇస్తామన్నారు. ఏపీ అభ్యంతరాలను తిప్పికొట్టి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుమతులు సాధించాం. పోలవరం-బనకచర్ల ప్రతిపాదనపైనా వెంటనే స్పందించాం. నీటి హక్కులను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. కాళేశ్వరం నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయి. ఈ విషయంలో కవిత చేసిన ఆరోపణలకు హరీశ్‌రావు జవాబు చెప్పాలి. ఏపీ కాంట్రాక్టర్ల నుంచి అందిన ముడుపుల్లో ఆయన వాటా ఎంత?" అని ఉత్తమ్ ప్రశ్నించారు.

### 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ

# అన్యాయం జరగదు

మొదటిపేజీ తరువాయి



మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ÷-రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు.

22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశిరచిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఎ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

# రాత్రి ఎగువన కురిసిన వర్షం..

**- భారీ వరద ప్రవాహంతో పరవళ్లు తొక్కుతున్న మల్లారం మూలవాగు మత్తడి**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 05



నిన్న మంగళవారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షాలకు వేములవాడ గ్రామీణ మండలం మల్లారం గ్రామంలోని మూలవాగు ఉప్పొంగి పరవళ్లు తొక్కుతోంది. గత కొన్ని రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో జలాశయాలు, వాగులు, వంకలు నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. మల్లారం మూలవాగుపై ఉన్న మత్తడి వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంతమంతా చూడముచ్చటగా మారింది. ప్రస్తుతం వర్షాలు అనుకూలించడంతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతన్నలు ఆనందోత్సాహాల నడుమ పొలాల్లో వరి నాట్లు వేస్తూ తీవ్ర బిజీగా గడుపుతున్నారు. ఈ సారి కురుస్తున్న వర్షాలు పంటలకు ఎంతో మేలు చేస్తాయని, మూలవాగు నిండి ప్రవహించడంతో భూగర్భ జలాలు పెరిగి ఏడాదంతటికీ నీటి కొరత తీరుతుందని వ్యవసాయదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిండి పారుతున్న వాగును చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

# విద్యార్థి దశ నుంచే సైబర్ మోసాలకు ఫుల్‌స్టాప్ సైబర్ సురక్షిత తెలంగాణ నిర్మాణానికి ఎస్పీ మహేష్ బి. గితే పిలుపు

**- "అగు ఆలోచించు నిజం నిర్ధారించు సైబర్ భద్రత పెంచు" నినాదంతో జిల్లా కేంద్రంలో భారీ సైబర్ అవగాహన ర్యాలీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా / ప్రజాదివాస్ ఆగస్టు 5

విద్యార్థి దశ నుంచే సైబర్ మోసాలకు ఫుల్‌స్టాప్ పలికి, అందరూ కలిసి సైబర్ సురక్షిత తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసోత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించి సురక్షిత డిజిటల్ వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసగిస్తున్నారని, అత్యాశకు లోనుకాకుండా వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు.సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల ద్వారా వచ్చే పెట్టుబడి అవకాశాలు, ఉద్యోగ ఆఫర్లు, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అలాగే డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, లోన్ యాప్స్ తదితర మోసాలపై కూడా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు అందిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే, ముఖ్యంగా "గోల్డెన్ అవర్" (మొదటి గంట)లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.



విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో మరింత జాగ్రత్తగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, ఫ్రెండ్ రిక్వెస్టులకు స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా వేదికలపై ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు."అప్రమత్తంగా ఉండండి అవగాహన పెంచుకోండి సైబర్ సురక్షితంగా ఉండండి" అనే "సురక్ష కా తిరంగా" ప్రచార సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గణేష్, నాగరాజు, జునైద్, సైబర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోతుగల్ గర్ల్స్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన

**- సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ**



ముస్తాబాద్/ ఆగస్టు 5 ప్రజా దివాస్

ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (గర్ల్స్ హైస్కూల్)లో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గ్రామాభివృద్ధి, సంక్షేమంలో భాగంగా మంగళవారం స్థానిక సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ పాఠశాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో భోజన తయారీ విధానాన్ని, వంట గది శుభ్రతను, వాడే పదార్థాల నాణ్యతను ఆయన ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యత, రుచిని స్వయంగా తెలుసుకోవడానికి సర్పంచ్ విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం అత్యంత నాణ్యతగా, శుభ్రంగా మరియు పౌష్టికాహారంతో కూడి ఉండాలి. వంటకాల్లో ఎలాంటి లోపాలు లేకుండా, సమయానికి వేడిగా విద్యార్థులకు అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను, ఉపాధ్యాయులను కోరడం జరిగింది మన గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి బిడ్డ ఆరోగ్యం, చదువు మాన బాధ్యత. అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం,మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన తరానికి తల్లిపాలే తొలి అడుగు: సర్పంచ్ ఇటిక్యాల రాజు

**- ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు**
**- శిశువుకు ముర్రిపాలే తొలి అమృతం.. అంగన్వాడీ కేంద్రంలో ప్రత్యేక అవగాహన సదస్సు**
**- పోషకాహారం తీసుకోవాలి... చిన్నారుల ఆరోగ్యం కాపాడాలి: సర్పంచ్ ఇటిక్యాల రాజు**




వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 05

వేములవాడ అర్బన్ మండలంలోని ఆరెపల్లి గ్రామ ప్రభుత్వ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఇటిక్యాల రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉపసర్పంచ్, పాలకవర్గం, మరియు పంచాయతీ సెక్రటరీ కళావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత, పోషకాహార అవసరం మరియు శిశు సంరక్షణ చర్యలపై విస్తృత అవగాహన కల్పించారు.సమావేశంలో సర్పంచ్ ఇటిక్యాల రాజు మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన తరానికి తల్లిపాలే తొలి అడుగు అని స్పష్టం చేశారు. ప్రసవం జరిగిన వెంటనే, పుట్టిన గంటలోనే శిశువుకు ముర్రిపాలు పట్టించడం ఎంతో అవసరమని, అవి బిడ్డకు తొలి రోగనిరోధక శక్తిని అందించే అమృతం లాంటివని పేర్కొన్నారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, ఆ తర్వాతే వైద్యుల సూచనల మేరకు ఇతర అదనపు పోషకాహారాన్ని ప్రారంభించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా గుడ్లు, పాలు, ఆకుకూరలు వంటి పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించబడి, తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదల కూడా మెరుగ్గా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార పథకాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని చిన్నారులందరూ ఆరోగ్యంగా ఎదిగేలా తల్లిదండ్రులు సమయానికి టీకాలు వేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, పంచాయతీ సెక్రటరీ కళావతి, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆయమ్మలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లి వద్ద కూలిన భారీ మర్రి వృక్షం

**- మూడు గంటల పాటు నిలిచిన వేములవాడ**
**- కరీంనగర్ ట్రాఫిక్**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 05



వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నుండి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం ఒక భారీ మర్రి వృక్షం కూలిపడింది. దీనితో కరీంనగర్ - సిరిసిల్ల - వేములవాడ మధ్య తీవ్ర స్థాయిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రహదారికి ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కీలకమైన ప్రధాన రహదారి కావడంతో, చెట్టు కూలడంతో దాదాపు మూడు గంటల పాటు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి రాకపోకలను పునరుద్ధరించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# వేములవాడ సుమిత్ర శ్రీ, శివాని కళాశాలల్లో ఘనంగా 'ఫ్రెషర్స్ డే' వేడుకలు

**- అన్ని రంగాల్లో విద్యార్థులు ముందంజలో ఉండాలి: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి**
**- కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు ఆనంద రెడ్డి**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 05

వేములవాడ పట్టణంలోని సుమిత్ర శ్రీ ఒకేషనల్ కళాశాల, శివాని పారామెడికల్ కళాశాల ప్రాంగణంలో ఫ్రెషర్స్ డే (నూతన విద్యార్థుల ఆహ్వానోత్సవం) వేడుకలను బుధవారం కళాశాల కరస్పాండెంట్లు మడ్డి స్వప్న, శేఖర్‌ల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, అమృత నర్సింగ్ హోమ్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆనంద్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు అన్ని రకాల సృజనాత్మక రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ప్రతియేటా సుమిత్ర శ్రీ, శివాని కళాశాలల యాజమాన్యం విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం నూతనంగా చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థి-విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి మోడల్ వాక్ చేయడంతో పాటు చేసిన పలు నృత్య రూపకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది లత, పద్మ, మమత, వర్ష, ప్రతిభ, ప్రణయ్‌లతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గంభీరవుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.

గంభీరవుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 05

జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో ఈరోజు గంభీరవుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, నేరస్తులపై నిఘా అంశాలను సమీక్షించడంతో పాటు స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల నాణ్యతపై ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు డయల్ 100 స్థానంలో ఈరోజు నుంచి అమల్లోకి వచ్చిన డయల్ 112 అత్యవసర సేవలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అత్యవసర సమయంలో డయల్ 112ను వినియోగించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలక పాత్ర పోషిస్తుందని కావున సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. రాత్రి సమయాల్లో గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, పెట్రోలింగ్ చేసే సమయంలో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల, అనుమానిత వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చట్టవిరుద్ధ



కార్యకలాపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్పి వెంట సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

# తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

**- విద్యానగర్ కాలనీ సర్పంచ్ , ఉప సర్పంచ్**

ప్రజాదివాస్



చుంచుపల్లి : మండల పరిధిలోని విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయితీ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరిగింది. చుంచుపల్లి సెక్టర్ సూపర్వైజర్ సీత మంగమ్మ ఆధ్వర్యంలో స్థానిక అంగన్వాడీ టీచర్స్ సమక్షంలో తల్లిపాల విశిష్టతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు . ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా విద్యానగర్ కాలనీ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ , ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి పాల్గొని వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలే తాగించాలని , తల్లిపాలలో ఉండే కోలొస్ట్రమ్ బిడ్డకు రోగ నిరోధక శక్తిని ఇస్తుందని , పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు తాగించాలని , పిల్లలకు పాలు ఇవ్వటం వల్ల తల్లులకు రొమ్ము క్యాన్సర్ ముప్పు తగ్గుతుందని వారంటూ ఆరు నెలల అనంతరం పోషకాహారం అందించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో విద్యానగర్ కాలనీ వార్డ్ మెంబర్స్ వాడపల్లి జకరయ్య , మాలోత్ శంకర్ , నాగమణి , రమాదేవి పూర్ణ ,, నాగమణి , రజిత , తో పాటు, డాక్టర్ పద్మ కుమార్, గ్రామపంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు , పంచాయతీ గుమస్తా రామకృష్ణ , బిల్ కలెక్టర్లు , శానిటేషన్ సూపర్వైజర్ , ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు .

# దక్షిణ కాశి వేములవాడలో భక్తిశ్రద్ధలతో శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం

**- బద్దిపోచమ్మ బోనాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 05

దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామదేవత శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం శ్రీ భీమేశ్వర స్వామివారికి కోడె మొక్కులు చెల్లించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం దేవస్థానం యూనియన్ కార్యాలయంలో సంప్రదాయబద్ధంగా బోనాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉప్పుగడ్డ హనుమాన్ ఆలయం నుండి శ్రీ బద్దిపోచమ్మ



అమ్మవారి ఆలయం వరకు నిర్వహించిన బోనాల ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, ఉద్యోగుల సాంప్రదాయ నృత్యాలు మరియు భక్తుల జైజైధ్వానాల నడుమ ఈ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. ఆలయ ప్రాంగణానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు శేషవస్త్రం కప్పి స్వాగతం పలికి వేదాశీర్వచనం అందించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి స్వయంగా బోనం ఎత్తి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని రంగురంగుల పూలతో సుందరంగా అలంకరించి కల్లు, బెల్లం, శాకం వంటి సంప్రదాయ నైవేద్యాలను నివేదించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, యూనియన్ ప్రతినిధులు, టీఎన్‌జీవో నాయకులు మరియు వేలాదిగా తరలివచ్చిన భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం

ప్రజాదివాస్



ఝరాసంగం, ఆగస్టు 5: రైతులు పంటల యాజమాన్య పద్ధతులను శాస్త్రీయంగా అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మంగళవారం ఝరాసంగం మండలంలోని సిద్ధాపూర్ రైతు వేదిక లో నిర్వహించిన పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమంలో రైతులకు సోయాబీన్, కంది, పెసర మినుము పత్తి పంటల సాగులో అనుసరించాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించారు.

ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్త రమేష్ మరియు వ్యవసాయ అధికారి టెక్నికల్ వినోద్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, సరైన మొక్కల సాంద్రత, సమతుల్య ఎరువుల వినియోగం, కలుపు నివారణ, సమగ్ర పురుగు మరియు తెగుళ్ల యాజమాన్యం, పంటల పెరుగుదల దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ షరీఫ్ మియా, ఉప సర్పంచ్ విమలమ్మ పిఎసిఎస్ వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారి సుకుమార్, రైతులు సంగమేశ్వర్, మోయిజ్, రాములు మహమ్మద్, యేసురత్నం, సుభాష్ రెడ్డి పెంటన్న తదితరులు పాల్గొనారు.

# ఊసరవెల్లిగా రంగులు మారుతున్న ముస్తాబాద్ గ్రామపంచాయతీ భవనం

**- పాలకుల లోపం అధికారులకు శాపం**
**- ప్రభుత్వ భవనానికి పార్టీల రంగులు**

ముస్తాబాద్/ ఆగస్టు 5 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో గల మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయానికి పలు రాజకీయ పార్టీల రంగుల పోటీలు గతంలో బి ఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి లేత గులాబీ రంగులు వేశారు ఇటీవల గ్రామ పంచాయతీ పాలకవర్గం తెలుపు రంగు వేయాలని తీర్మానం చేయడంతో మధ్యలో కాషాయపు రంగు వేయడంపై మూడు రాజకీయ పార్టీల మధ్య పోరు రగులుతుంది ఈ సమస్య పైన సంబంధిత అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు భారత రాజ్యాంగ బద్ధంగా కార్యాలయాలకు పంచాయతీ రాజు యాక్ట్ ప్రకారం మాత్రమే రంగులు వేయాలని విరుద్ధంగా వేసిన





రంగులను తొలగించాలని సంబంధిత జిల్లా అధికారులు మండల అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో మళ్లీ పంచాయతీ కార్యాలయానికి కొత్త రంగులు వేస్తున్నారు గ్రామంలోని పాలకులు అభివృద్ధిపై దృష్టి లేక రంగుల పై ఆర్భాటాలు చేస్తూ కాలయాపన చేయడం ఏమిటని పలువురు గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు అధికారులు సైతం పంచాయతీ రాజ్ యాక్టివ్ ను అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతో సమస్యలు అధికమవుతున్నాయని భారత రాజ్యాంగం ప్రకారం నియమ నిబంధనలను తప్పకుండా అమలు చేస్తే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అధికారులు ఏ పార్టీలకు కొమ్ము కాయకుండా నిజాయితీగా పనిచేసినప్పుడు గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని గ్రామ అభివృద్ధిలో అధికారులు ప్రజలందరూ కలిసి పని చేసినప్పుడే స్వరాజ్య స్థాపన జరుగుతుందని గ్రామ ప్రజలు కోరారు

# ఝరాసంగం లో లైబ్రరీ సమస్యలపై ఎంపీడీఓ కి వినతి పత్రం

ప్రజాదివాస్



మండలానికి చెందిన పలువురు యువకులు ఝరాసంగం ఎంపీడీఓ ని కలిసి లైబ్రరీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గత 10 సంవత్సరాలుగా పూర్తి స్థాయి లైబ్రేరియన్ (ఖీబశ్రీశ్రీ ౦ఱవవ ఔశీతీఎవతీ) నియామకం లేకపోవడంతో పాటు, గత 5 సంవత్సరాలుగా లైబ్రరీ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదని వారు తెలిపారు. అలాగే, లైబ్రరీలో కుర్చీలు, టేబుళ్లు వంటి మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ సమస్యలను పరిశీలించి, త్వరితగతిన పూర్తి స్థాయి లైబ్రేరియన్‌ను నియమించి, లైబ్రరీని తిరిగి ప్రారంభించడంతో పాటు అవసరమైన కుర్చీలు, టేబుళ్లు మరియు ఇతర సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కి విజ్ఞప్తి చేశారు.

# లింగంపేటలో అదుపు తప్పిన బైక్.. వృద్ధుడికి గాయాలు..

చందుర్తి మండలం/ప్రజాదివాస్ ఆగస్టు 05

చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి మరుపాక ఎల్లయ్య(68) కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు, చేతులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ మల్రి ప్రశాంత్, పైలట్ తోట నరేందర్ ఘటనాస్థలికి చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





# జెడ్పీ పాఠశాల షెడ్డు నిర్మాణానికి రాజకీయ అడ్డంకులు..

ప్రజాదివాస్






కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం స్టేజీ షెడ్డు నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చినప్పటికీ, కొంతమంది రాజకీయ నాయకుల జోక్యంతో నిర్మాణ పనులను అడ్డుకోవడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రాత్రి 10 గంటల వరకు రీక్కీ నిర్వహించినట్లు సమాచారం. అట్టి స్కూల్ పై గొడవలు జరగడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో నిర్వహించే ప్రార్థనా సమావేశాలు, జాతీయ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర విద్యా కార్యక్రమాల సమయంలో విద్యార్థులు ఎండ, వర్షాలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్టేజీపై షెడ్డు నిర్మించాలని దాతలు నిర్ణయించినట్లు తెలిపారు. అయితే నిర్మాణ పనులు ప్రారంభించే సమయంలో రాజకీయ కారణాలతో కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల ప్రయోజనాల కోసం చేపట్టే అభివృద్ధి పనులను రాజకీయ వివాదాలకు దూరంగా ఉంచాలని, దాతల సహకారంతో షెడ్డు నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు కొనసాగించేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

# జోగిపేటలోని 12వ వార్డు కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు (నాని) ఆధ్వర్యంలో ఘనంగా తొట్టెల ఊరేగింపు

- ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ ఎస్ కృష్ణ రెడ్డి
- తొట్టెల కార్యక్రమాన్ని ప్రారంభించిన చైర్మన్ ఎస్ కృష్ణారెడ్డి పదవ వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్




ప్రజాదివాస్

ఆందోల్ నియోజకవర్గం లోని జోగిపేట పట్టణంలో గల 12వ వార్డులో కౌన్సిలర్ కొరబోయిన నాగరాజు (నాని ) తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా తొట్టెల ప్రోగ్రాం కార్యక్రమాన్ని జరిపిస్తున్నామని ఈ కార్యక్రమం జరిపించడం వలన మా వార్డు ప్రజలు సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారు అనుగ్రహిస్తుందని పిల్లల గాని పెద్దలు గాని ఆషాడ మాసం బోనాల సందర్భంగా కార్యక్రమం ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉండవని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అల్లే శ్రీకాంత్ మాజీ కౌన్సిలర్లు తుపాకుల సునీల్ కుమార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉలువల రాజు ఆకుల నందు మరియు పెద్దలు హరి నారాయణ వర్మ విలువల శ్రీనివాస్ సయ్య సాయికుమార్ అలాగే కాలనీవాసులు పెద్ద మనుషులు యువకులు , చిన్నలు, పెద్దలు తదితరులు అందరూ పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# బీసీ హాస్టల్స్ తనిఖీ చేసిన ఝరాసంగం ఎంపీడీవో మంజుల

ప్రజాదివాస్



మండలంలో ఎంపీడీవో మంజుల బీసీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.ఆమె హాస్టల్‌లోని రికార్డులు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, విద్యుత్, మరుగుదొడ్లు, విద్యార్థుల వసతి సౌకర్యాలు మరియు భోజన నాణ్యత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో వసతి గృహం మెట్రన్ శారదతో పాటు ఇతర హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకట్రావుపేట అంగన్వాడీకి.. రూ. 3 లక్షలతో సింగిల్ ఫేజ్ DTR మంజూరు!

- అంగన్వాడీకి విద్యుత్ వెలుగులు: కలెక్టర్, టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులకు గ్రామస్తుల ధన్యవాదాలు
- హర్షం వ్యక్తం చేసిన గ్రామ సర్పంచ్ మంతెన గీతాంజలి సంతోష్

కోనరావుపేట మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 05



కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సమస్య తీరనుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సుమారు రూ. 3 లక్షల విలువైన 'సింగిల్ ఫేజ్ ఱ=' మంజూరైంది. ఈ మంజూరు పట్ల గ్రామస్తులు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడీ కేంద్రానికి ఱ= మంజూరు చేసినందుకు జిల్లా కలెక్టర్, టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులకు గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పనులను వేగవంతం చేయడానికి, విద్యుత్ అధికారులను ఒప్పించి పనులు మంజూరు చేయించడంలో విశేష కృషి చేసిన మాజీ సెస్ ప్రతినిధి శ్రీ మంతెన (గ్యాస్) మల్లేశంకి, గ్రామ సర్పంచచ్ మంతెన గీతాంజలి - సంతోష్ కి మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మంతెన గీతాంజలి సంతోష్, ఉప సర్పంచ్ బుట్టి వంశీ, అంగన్వాడీ టీచర్ మనెమ్మ, వార్డు సభ్యులు జోరీగల మల్లేశం, ఉలిసే రాజు, సతీష్ సార్, బుట్టి రమేష్, మంతెన (గ్యాస్) మల్లేశం, మ్యాకల ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు. వెంకట్రావుపేట గ్రామం అభివృద్ధి పథంలో ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలని నాయకులు, అధికారులు ఆకాంక్షించారు.

# ఇంటికి మహాలక్ష్మి జన్మిస్తే సర్పంచ్ గా 'మేనమామ కట్నం..

- హన్మాజీపేటలో ఆడబిడ్డకు రూ. 5,000 కానుక
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్ జంకె మధు.. దంపతులకు 5 వేలు అందజేత

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 05

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తీగల వర్షిణి - రాజు దంపతులకు ఆడపిల్ల జన్మించడంతో, సర్పంచ్ జంకె మధు రూ. 5,000 నగదును మేనమామ కట్నంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జంకె మధు మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామంలో ఆడపిల్ల పుడితే మేనమామ కట్నంగా రూ. 5,000 అందజేస్తామని ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. ఆడపిల్లల పుట్టుక ఆ ఇంట్లో సంతోషాన్ని నింపాలని, పేద కుటుంబాలకు ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో ఆడపిల్ల పుట్టిన ప్రతి కుటుంబానికి ఈ సాయం కొనసాగుతుందని, గ్రామ అభివృద్ధికి, సంక్షేమానికి పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిని దివ్యశ్రీ, గ్రామ కార్యదర్శి విజయ్, ఉప సర్పంచ్ ఆవునూరి శంకరవ్వ,



పంచాయతీ పాలకవర్గ సభ్యులు కోడం రవి, అవునూరి కార్తీక్, జంకె సత్తయ్య, శంకసాల రాజేష్, తీగల స్రవంతి, గొర్రె నర్సవ్వ, జంకె లావణ్య, అంగన్వాడి టీచర్ విక్కుర్తి జూలి, ఆశా వర్కర్లు గౌతమి, ప్రవళిక, ఎఎన్ఎమ్ విజయలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకులపై తీవ్రంగా మండి పడ్డ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు

ముస్తాబాద్ / ఆగస్టు 5 ప్రజా దివాస్

ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బీజేపీ నాయకులకు మత విద్వేషాలు దేశం కోసం దర్మం కోసం అంటూ రెచ్చగొట్టడం తప్ప అభివృద్ధిపై మాట్లాడే దమ్ము లేదు అన్నారు జాతీయ జెండా రంగు వేస్తే పాకిస్తాన్ అనడం వీరి దేశభక్తికి నిదర్శనం అన్నారు.మీరు వేసుకున్న కండువాలోనే ఆకుపచ్చ రంగు ఉన్నది దమ్మొంటే ఆ రంగును తీసివేంచుకోండి అన్నారు రైతుకు రెండు లక్షల రుణ మాఫీ, ఇందిరమ్మ ఇల్లు,ఉచిత



విద్యుత్,ఉచిత బస్సు ప్రయాణం,10 లక్షల వరకు ఉచిత వైద్యం, రైతులకు రైతు భరోసా, ఇలాంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని త్రివర్ణ పతాకాన్ని అవమానించిన బిజెపి జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీపై గాని కార్యకర్తలపై గాని ఇలాంటి పదజాలంతో మాట్లాడితే బౌతీక దాడులు తప్పవు అని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ తాళ్ళ విజయ్ రెడ్డి,ఆరుట్ల మహేష్ రెడ్డి,వార్డు సభ్యులు రంజాన్ నరేష్, లీగల్ సెల్ కన్వీనర్ సారగు రాకేష్,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గోవర్ధన్, కొండాపూర్ యారటి కరుణాకర్,బండి శ్రీకాంత్, చాకలి బాబు,ఏద్దెండి మహేష్,ఎన్ ఎస్ యు ఐ నాయకులు భాను, సారుగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# బోనాల మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- అమ్మవారికి ప్రత్యేక పూజలు.. ప్రజల శ్రేయస్సు, రైతుల సంక్షేమం కోసం ప్రార్థన

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 05

ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ఎంప్లాయిస్ యూనియన్‌తో పాటు వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ





అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించినట్లు తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు సామాజిక ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని విస్తృతం చేస్తాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే ఇటువంటి ఉత్సవాలు సాంస్కృతిక విలువలను భావితరాలకు చేరవేస్తాయని అన్నారు.కార్యక్రమంలో దేవస్థానం ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వదలపర్తి పాఠశాలలో పునఃప్రారంభమైన

# మధ్యాహ్న భోజన పథకం

ప్రజాదివాస్



నాగిరెడ్డిపేట మండలంలోని వదలపర్తి గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గత పది రోజులుగా మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీ రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ సత్యబోయిన పద్మ నారాయణ ఆధ్వర్యంలో నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగిరెడ్డిపేట మండల ఎంఈఓ, మండల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కొత్త మధ్యాహ్న భోజన ఏజెన్సీతో చర్చించి, వెంటనే సేవలు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. దీంతో బుధవారం నుంచి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తిరిగి ప్రారంభమైంది. భోజన కార్యక్రమం పునరుద్ధరణతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఇకపై ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు.


## తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నర్సాపూర్ వైస్ ప్రెసిడెంట్‌గా డి. వినోద్ కుమార్‌కు అపాయింట్‌మెంట్ లెటర్ జోగిపేట్ ఎస్సై గిరి శ్రీకాంత్ చేతుల మీదుగా శాలువాతో సత్కారం



ప్రజాదివాస్

తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ నూతనంగా నియమితులైన నర్సాపూర్ వైస్ ప్రెసిడెంట్ డి. వినోద్ కుమార్‌కు జోగిపేట్ ఎస్సై గిరి శ్రీకాంత్ చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ లెటర్ అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై గిరి శ్రీకాంత్ మాట్లాడుతూ, సమాజానికి నిజాయితీతో కూడిన వార్తలను అందించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను బాధ్యతాయుతంగా వెలుగులోకి తీసుకురావాలని, నూతన బాధ్యతలు స్వీకరించిన డి. వినోద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నేషనల్ సెక్రటరీ టి. సంగమేశ్వర్, నేషనల్ ప్రచార కార్యదర్శి కే. సంగమేశ్వర్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, స్టేట్ సహాయ కార్యదర్శి మన్నే పోచయ్యతో పాటు ఇతర సభ్యులు పాల్గొని నూతనంగా నియమితులైన డి. వినోద్ కుమార్‌ను అభినందించారు.

## మాయొక్క ముద్దుల తనయుడు. కమ్మకోల్ అజయ్ కుమార్ పుట్టినరోజు జన్మదిన శుభాకాంక్షలు





– ప్రేమతో మీ అమ్మ నాన్న కమ్మకోల్ రాజేశ్వరి యాదయ్య

ప్రజాదివాస్

మదిలోని భావాలను మధురంగా పంచుకుని అ సుదినం నీ జన్మదినం. ఇరవై మూడు రంగుల వసంతాలతో ముందుకు సాగాలని. మా తనయుడు కి. అష్ట ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆ శివుని ఆశీస్సులతో ఎన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆ భగవంతున్ని నీ కుటుంబ సభ్యులు కోరుచున్నాము. కమ్మకోల్.అజయ్ కుమార్ పుట్టినరోజు ఈ పుట్టినరోజు అందం, ఆనందం, కలపోసిన మధుర క్షణాలతో నిండాలని,నువ్వు తలచిన అన్ని పనులలో విజయం లభించాలని, నీవు ఆధ్యాత్మికంగా, వ్యక్తిగతంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే శక్తిని ప్రసాదించమని ఆ భగవంతుడిని వెడుతూ...... ఆ దేవుడి ఆశీస్సులు ఎల్లవేళలా నీపై ఉండాలని కోరుకుంటూ మీ నానమ్మ కమ్మ కోల్ శకుంతల నీ ముద్దుల చెల్లి అంజలి. మీ బావ సాయికుమార్

# సింగరేణి ఉమెన్స్ డిగ్రీ విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

ప్రజాదివాస్

కొత్తగూడెం :తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సురక్ష కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఎక్కువ జరుగుతున్న డిజిటల్ అరెస్ట్, స్టాక్ బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, లోన్ యాప్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, ఏపీకే ఫైళ్ల ద్వారా జరిగే సైబర్ నేరాలు, మ్యూల్ బ్యాంక్ అకౌంట్ల వినియోగం వంటి సైబర్ మోసాల గురించి ఎస్పీ ఉదాహరణలతో విద్యార్థినులకు వివరించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు, ఉద్యోగ అవకాశాలు, సినిమా అవకాశాలు, తక్కువ వడ్డీ రుణాలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మి వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. అదేవిధంగా సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తూ, డిజిటల్ లావాదేవీల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, వీడియో కాల్స్, ఓటిపిలు, కేవైసీ అప్‌డేట్, లోన్‌లు లేదా రివార్డుల పేరుతో వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మవద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, సకాలంలో ఫిర్యాదు చేస్తే నష్టపోయిన నగదును తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. అలాగే విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రతికూల



ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ ధరించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సైబర్ సెల్ సిఐ జితేందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్, సైబర్ సెల్ పోలీసు అధికారులు, సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో వార్డు నెంబర్ 1 లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఘనంగా శ్రీకారం

**– ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం : మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్**





ప్రజాదివాస్

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెం:1 లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించే దిశగా నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఈరోజు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శంకుస్థాపన చేసి అధికారికంగా శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ కు అనుగుణంగా ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. వర్షాకాలంలో బురద, గుంతలు, నీటి నిల్వల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాత్కాలికంగా తొలగించేందుకు ఇప్పటికే పలు వార్డుల్లో కంకర చిప్స్ వేయించడం జరిగిందన్నారు మరియు శాశ్వతంగా తొలగించేందుకు నాణ్యమైన సిసి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రజల పన్నుల రూపంలో వచ్చిన ప్రతి రూపాయిని పారదర్శకంగా వినియోగిస్తూ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి మున్సిపల్ పాలకవర్గం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, డి ఈ మహేష్, ఏఈ వెంకటేష్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ రంగా అరుణ్ కుమార్, సినియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి ఇతర కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన స్థానికులు మాట్లాడుతూ, తమ వార్డులో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సిసి రోడ్డు పనులు ప్రారంభం కావడం ఆనందంగా ఉందని, పనులు త్వరగా పూర్తయితే రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు కూడా తొలగిపోతాయని ఆశ భావం వ్యక్తం చేశారు. మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో రహదారులు, మురికి కాలువలు, తాగునీరు సౌకర్యాలు, విద్యుత్ సంబంధిత మౌలిక వసతులు తదితర అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా చేపడుతూ జహీరాబాద్ ను ఆదర్శ పట్టణంగా తీర్చితిద్దేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని అధికారులు తెలిపారు

# వంచనగిరిలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి కోట మైసమ్మ బోనాలు

**– మైసమ్మకు బంగారు బోనం సమర్పించిన మంత్రి కొండా సురేఖ**

**– భక్తి శ్రద్ధలతో గ్రామ ప్రజలతో కలిసి మైసమ్మ తల్లిని కొలిచిన కొండా దంపతులు...**

ప్రజాదివాస్

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గ్రామంలో ఆషాడ మాసం సందర్భంగా రాష్ట్ర అటవీశాఖ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో వైభవంగా సాగిన కోట మైసమ్మ బోనాల ఊరేగింపుతో డప్పు చప్పుల మధ్య కళాకారుల విన్యాసాలు పోతరాజుల శివసత్తుల శివతాండవాలతో పర్వదినం పవిత్రమైన బుధవారం రోజున గీసుకొండ మండలంలోని ప్రసిద్ధ కోట మైసమ్మ ఆలయంలో బంగారు బోనంతో తల్లిని కొలిచిన కొంగు బంగారం బోనంతో నిస్వార్థ సేవ కల్పనా గ్రామ ప్రజలతో భక్తి భావనలకు ఒక శాశ్వత రూపం ఇచ్చింది. తన స్వగ్రామమైన వంచనగిరి స్వగృహం నుండి గ్రామ ప్రజలతో కలిసి గ్రామ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి టెంకాయలు కొట్టి అనంతరం రెండు కిలో మీటర్ల దూరాన కాలినడక కోట మైసమ్మ టెంపుల్ వరకు దారి పొడవునా ప్రజలతో కలిసి బంగారు బోనం నెత్తిన మోసి కుటుంబ సాంప్రదాయాన్ని కొనసాగించిన మంత్రి కొండా సురేఖ అమ్మవారికి తలపై బోనం హృదయంలో



భక్తి ప్రతి అడుగులో అమ్మవారిపై ఆచంచల విశ్వాసాన్ని చాటిన మంత్రి సురేఖ ప్రజల మేలు కోసం మహిళ సమూహాల ఆకట్టుకునే బోనాలు మైసమ్మకు సమర్పించారు. ప్రజాస్వామిక విలువల పట్ల నాయకత్వ కుటుంబం చూపిన అమ్మవారు దీవెనలతో సామాన్యుల సంక్షేమం కోసమే తన రాజకీయ జీవితం అంకితం చేసిన మంత్రి కొండా సురేఖ కోట మైసమ్మ బోనాలు మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ పవిత్ర వేడుకశ్రీశీ గ్రామ మహిళలు చూపించిన భక్తి నియమ నిష్టలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. భక్తి లోను ప్రజల సేవా తత్వాన్ని భక్తి పూర్వకంగా మొక్కలు చెల్లించారు. అంతేకాకుండా గంభీరంగా రాజకీయ బాధ్యతలతో పాటు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలోనూ




నాయకత్వం వహిస్తున్న కొండా దంపతులు ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీక జీవన విధానం సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆషాడ మాస బోనాలు ఘనమైన చరిత్రకు నిదర్శనమని అన్నారు. రైతుల పంటలపై తల్లి కరుణలు కురిపించాలని ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోట మైసమ్మ తల్లిని ప్రార్థించామని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు మహిళా సోదరీమణులు అభిమానులు కార్యకర్తలు గ్రామస్తులు విజయవంతం చేశారు.

# అంగన్వాడీ లలో పిల్లలకు అందాల్సిన సరుకులు ఎవరి ఖాతాలోకి వెళుతున్నాయి : ఆధార్ పార్టీ కేశవ్ గౌడ్

ప్రజాదివాస్

దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామంలో ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అధ్యక్షులు కంటే కేశవ గౌడ్ వారి నివాసంలో పత్రిక ప్రకటన విడుదల చేసారు ఈ సందగర్భంగా ఆయన మాట్లాడుతూ దమ్మపేట మండలంలో ఉన్నా అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి ఇచ్చే పోషకాహారం అందించే క్రమంలో పిల్లలకి భాలింతలకు గర్భిణీ స్త్రీలకు కిషోర భాలికలకు ఇచ్చే కోడిగుడ్డు లు కంది పప్పు మంచి నూనె బియ్యం ఏవి కూడా సక్రమంగా ఇవ్వటం లేదు అని కొంత మంది మహిళలు నా దృష్టికి తీసుకు రావటం జరిగిన్ది మరి వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు రచించే స్త్రీ శిశు సంక్షేమశాఖ తరపున వేలాది కోట్ల రూపాయల ప్రజాదానవాడిని వెచ్చించి వారికి పోషకాహార



లోపం లేకుండా పూర్తి నాణ్యతతో కూడిన ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలతో పౌష్టికాహారం అందజేస్తా ఉంటే వాటిని సక్రమంగా పిల్లలకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు కిషోర్ బాలికలకు ఇవ్వకుండా విచ్చేసినట్టు రికార్డులు చూపిస్తా ఉన్నారు అదేంటని అడిగితే ప్రభుత్వం ఇవ్వటం లేదు మేమేం చేయమని అడిగినటువంటి వారిపై దౌర్జన్యానికి ధిగుతున్న అంగన్వాడి కార్యకర్తలు మరి దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయవలసినటువంటి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ గాని ఐసీడీయ స్ పి వోలు గాని సెక్టార్ సూపర్వైజర్లు గాని పర్యవేక్షణ లేకపోవడం వీరికి అవకాశం కుదిరిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు ఈ వ్యవహారం అంతటి పై జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేసి అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్య తీసుకుని గర్భిణీ స్త్రీలకు పిల్లలకు కిశోర బాలికలకు తగు న్యాయం చేయగలరని కోరుతున్నాం ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోకపోతే ఆధార్ పార్టీ తరపున గర్భిణీ స్త్రీలు బాలికలు బాలింతలు తరుపున ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం

# 13వ వార్డులో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన మున్సిపల్ చైర్మన్ కూన వణిత సంతోష్



ప్రజాదివాస్

సంగారెడ్డి పట్టణంలోని 13వ వార్డులోని అలయన్ కాలనీ, సాయినగర్ కాలనీలలో రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ కూన వణిత సంతోష్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక కౌన్సిలర్ వీణా కిరణ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షైక్ షఫీ, కౌన్సిలర్లు మహేష్, నవాజ్, హరీష్, శ్రీశైలం, ప్రసాద్, ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు మహేందర్, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సంగారెడ్డి పట్టణంలో ని 38 వార్డులలో పార్టీ లకు అతీతంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు.

# దమ్మపేటలో రూ.95 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

**– పలు గ్రామాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొనం**

ప్రజాదివాస్

దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ. 95 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ పనులకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు విద్య, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. మల్కారం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ రోడ్ల నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని తెలిపారు. అనంతరం గుత్తావారిగూడెంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని, శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే ఉత్తమ ఆహారమని, ప్రతి తల్లి మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు అందించాలని సూచించారు. తదుపరి గుర్వాయిగూడెం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు సురక్షిత వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. అనంతరం అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తంగిళ్ల విశ్వనాథ్ తల్లి రాములమ్మను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి



తెలుసుకున్నారు. అలాగే కుంజా సుజాత నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గండుగులపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది.

# తెలంగాణలో డయల్ 112 సేవల ప్రారంభం డిజిపి సివి ఆనంద్

**– కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డయల్ 112 సేవలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**

ప్రజాదివాస్




డీజీలు, సీపీలు, సీఐడీ చీఫ్ చారుసిన్హా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ హాజరు డయల్ 112 ద్వారా 18 అత్యవసర సేవలు అందుబాటులోకి రానున్నాయి పోలీసు, అగ్నిమాపక, వైద్య సేవలు ఒకే నంబర్‌తో అందుబాటులోకి. ఈ కార్యక్రమంలో డిజిపి మాట్లాడుతూ వన్ మంత్ ద్వారా 18 అత్యవసర సేవలు అందుబాటులోకి రానున్నాయి దీనివలన ప్రజలకు మరింత చేరువలు పోలీస్ మరియు అగ్నిమాపక వైద్య సేవలు ఒకే నెంబర్తో రావడం సంతోషకరమైన విషయం అన్నారు ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు

# కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి.

**– బిఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు కమిషన్ ల కోసం: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు**

ప్రజాదివాస్

కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయని బిఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు కేవలం కమిషన్ ల కోసమే కట్టారని అందుకే అవి తొందరగా కూలిపోయాయని : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, అన్నారు మంగళవారం జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ ముఖ్య నాయకులు రైతులతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్ శర్మ లతో కలిసి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించారు ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య , జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనభట్ల దినేష్ శర్మ లు మాట్లాడుతూఇటీవల బిఆర్ఎస్ నాయకులు మేడారం కోటి లింగాలను ప్రాజెక్టులను సందర్శించి కాళేశ్వరం ప్రాజెక్టు రివర్స్



పంపింగ్ ద్వారానే మేడారం కోటిలింగాల ప్రాజెక్టులో నీరు నిల్వ ఉన్నాయని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారానే మేడారం కోటిలింగాల మిడ్ మానేరుకు రివర్స్ పంపింగ్ ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు గతంలో కొంతమంది ఎమ్మెల్యేలు మంత్రులు మిడ్ మానేరులో సందర్శించి అక్కడ క్రికెట్ ఆడారు కదా మరి ఇప్పుడు మిడ్ మానేరులో ఒకసారి క్రికెట్ ఆడి చూపించండి అని కోరారు ఎండాకాలంలో నీరు లేని సమయంలో వెళ్లి క్రికెట్ ఆడటం కాదు మీరు ఇప్పుడు ఒకసారి ఆడి చూపిస్తే చూడాలని ఉందన్నారు కాంగ్రెస్ పార్టీపై ప్రతిక్షణం అవాక్కులు చేవాక్కులు మాట్లాడడం కాదు మీకు నిజంగా ప్రజలపై రైతులపై విశ్వాసం ఉంటే ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి తప్పు లేనిపోని అపోహలతో ప్రజలను తప్పుదోవ పట్టించదని సూచించారు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసమే కృషి చేస్తుందన్నారు రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం పాటుపడుతుందన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు కృష్ణారావు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి వివిధ వివిధ గ్రామాల సర్పంచులు పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు రైతులు భారీగా పాల్గొన్నారు

# సింగూర్ ప్రాజెక్టు దగ్గర పార్కుల మీటింగ్ జరిగింది.

ప్రజాదివాస్



క్లస్టర్ గోపాలమిత్ర సూపర్వైజర్ సిహెచ్ అర్జున్ అయ్యా గారి ఆధ్వర్యంలో గోపాల మిత్రులకు రివ్యూ మీటింగ్ సింగూరరులో నిర్వహించడం జరిగింది గోపాల మిత్రులకు ఉన్న సమస్యల గురించి చర్చించడం జరిగినది ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా గోపాలమిత్ర ఉపాధ్యక్షుడు డప్పు మాణిక్యం జనరల్ సెక్రెటరీ అలిగే శ్రీకాంత్ కమిటీ సభ్యులు ఎంఏ మాజీ కె ఆర్ ప్రభు మరియు గోపాల మిత్రులు అందరూ పాల్గొనడం జరిగిందిసి అర్జునయ్య మాట్లాడుతూ ఈవో ఉమ్మడి జిల్లా డాక్టర్ ప్రభాకర్ రావు ఆదేశానుసారముగా గోపాల మిత్రుల యొక్క పని వీధి వీధి విధానాల గురించి భవిష్యత్ కార్యాచరణ కృత్రిమ గర్భధారణ లింగనిర్ధారణ తర్వాత కాప్స్ గురించి అప్లోడ్ పశుదాన్ యాప్ లో నమోదు చేయుట గురించి క్లుప్తంగా వివరించడం జరిగినది సంగారెడ్డి జిల్లా ముందంజలో ఉండాలని సి అర్జునయ్య గోపాల మిత్రులకు తెలియజేయడం జరిగినది

# దేవాదుల నీళ్లు రావడంతో గడిచెర్ల రైతులు చాలా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు

ప్రజాదివాస్

దేవాదుల నీళ్లు రావడంతో రైతులు హర్ష వ్యక్తం చేస్తున్నారు బుధవారం గడిచెర్ల గ్రామంలో దేవాదుల కాల్వను సందర్శించిన స్థానిక డిఈ మరియు ఏఈ పంట కాలువలను సందర్శించినారు గ్రామ రైతు మందపూరి కొమురయ్య చేలుకల్లో నుండి ఉన్న కాల్వను గవి చర్ల మెయిన్ రోడ్డు వరకు జెసిబి తో చెత్తాచెదారం శుభ్రం చేయడం జరిగింది. కాల్వ ద్వారా గ్రామ ఉర చెరువు వరకు నీళ్లు రావడానికి కృషి చేసినారు గ్రామ రైతులు సంతోషంతో స్థానిక సర్పంచ్ కి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసినారు ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచి బాష్పాక సదయ్య కాంగ్రెస్ నాయకులు గుల్లపల్లి సురేందర్ గౌడ్ గోలి రవీందర్ రావుల రామకృష్ణ కొండోజు జగదీష్ గాలి రాజు సోషల్ మీడియా ప్రతినిధి మహబూబ్ పాషా రైతులు గూడ సంపత్ గాలి రాజు బర్ల అఖిల్ తదితరులు అధికారుల వెంట సందర్శించినారు



TGTEL/25/A0827


# విడుదలకు ముందే మాకు చూపించండి.. 'రామాయణ' టీమ్‌కు హెచ్చరికలు

నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'రామాయణ' చిత్రం విడుదలకు ముందే వివాదంలో చిక్కుకుంది. దిల్లీలోని శ్రీ రామ్‌లీలా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ సినిమాపై ఆందోళనను వ్యక్తం చేస్తూ.. చిత్ర బృందానికి లేఖ రాశారు. సినిమా విడుదలయ్యే ముందే తమకు చూపించాలని.. లేదంటే నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



**ముందస్తు ప్రదర్శన కోసం డిమాండ్..**

ఈ చిత్రం హిందూ మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసేలా ఉండకూడదనే ఉద్దేశంతో లేఖ రాస్తున్నట్లు అర్జున్ కుమార్ వివరించారు. టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత తమకు కొన్ని విషయాల్లో అసంతృప్తి కలిగిందని ఆయన తెలిపారు. "మేము ఈ సినిమాను స్వాగతిస్తున్నాం. లక్షలాది మంది ప్రజలు దీనిని చూడాలని కోరుకుంటున్నాం. రామ్‌లీలా కమిటీ సభ్యుల కోసం ఉచిత ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేస్తాం. అయితే, ట్రైలర్ మాకు కొంత బాధ కలిగించింది. అందులో కొన్ని భావోద్వేగాలు సరిగ్గా లేవని మాకు అనిపించింది. అలాగే, నటీనటుల కాస్ట్యూమ్స్ కూడా కొన్ని సన్నివేశాల్లో ఆమోదయోగ్యంగా లేవు. అందుకే ఈ సినిమా విడుదలకు ముందు మాకు కచ్చితంగా చూపించాలి" అని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో.. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. రామాయణ' సినిమాలో కొన్ని సన్నివేశాలు/సంభాషణలు అభ్యంతరకరంగా ఉండే అవకాశం ఉందనే సమాచారం




తమకు అందిందని, అందుకే ముందుగానే స్క్రీనింగ్ నిర్వహించి వాటిని తొలగించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తమ అభ్యర్థనను మేకర్స్ పట్టించుకోకుండా.. సినిమాలో అభ్యంతరకర అంశాలు ఉంటే థియేటర్‌లలో నిరసనలు చేపడుతామని అర్జున్ కుమార్ హెచ్చరించారు.నితీశ్ తివారీ దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రని సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడిగా నటిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేశారు.

# వెంటనే తొలగించండి.. డీప్ ఫేక్ ఫొటోలపై మృణాల్ ఆగ్రహం



కృత్రిమ మేధను దుర్వినియోగం చేసి సృష్టించే డీప్‌ఫేక్ ఫొటోలు సెలబ్రిటీలను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ఇప్పుడు నటి మృణాల్ ఠాకూర్ ఈ డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఇటీవల ఎక్స్‌లోని ఒక పేజ్‌లో మృణాల్ మార్ఫింగ్ ఫొటోలు కన్పించాయి. అవి క్షణాల్లో వైరల్‌గా మారాయి. తాజాగా వీటిపై నటి స్పందిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నా డీప్‌ఫేక్ ఫొటోలను క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం చట్టవిరుద్ధం. ఇలాంటి పనులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. తక్షణమే వాటిని తొలగించండి. లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది" అని మృణాల్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇకపై ఈ ఫొటోలను ఎవరు షేర్ చేసినా.. వారిపై కూడా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గతంలో రష్మికతో పాటు పలువురు హీరోయిన్లు ఇలాంటి ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ కంటెంట్ బారిన పడిన విషయం తెలిసిందే. ఈ కేసుల్లో కొందరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నాటి ఫొటోలపై పలువురు ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అత్యంత హేయమైన చర్య అని అన్నారు. టెక్నాలజీ దుర్వినియోగం కాకుండా ఉండటానికి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# అప్పుడు సూర్య కంటే 3 రెట్లు ఎక్కువ సంపాదించా: జ్యోతిక



ఇండస్ట్రీలో క్యూట్ కపుల్ అనగానే గుర్తొచ్చేది సూర్య-జ్యోతికనే. సందర్భం వచ్చినప్పుడల్లా వీరిద్దరూ తమ ప్రేమను తెలుపుతూనే ఉంటారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సూర్యతో తన బంధం, కెరీర్ ప్రారంభంలో ఉన్న పరిస్థితుల గురించి జ్యోతిక పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కెరీర్ ప్రారంభంలో సూర్య కంటే తానే ఎక్కువ సంపాదించినట్లు తెలిపారు. 'ఆ రోజుల్లో ఆయన పారితోషికం కంటే నా రెమ్యునరేషన్ మూడు రెట్లు ఎక్కువ. ఇప్పుడు అది 30 రెట్లు తగ్గింది' అని సరదాగా చెప్పారు."సూర్య ఒక నటుడిగానే కాకుండా భర్తగా చాలా గొప్ప వ్యక్తి. ఆయన మనసులో సమానత్వం మొదటి నుంచే ఉంది. అది సహజంగా పుట్టుకతోనే రావాలి. అమ్మాయిలకు వంట చేయడం రాకపోయినా.. ఏదైనా పని ఇష్టం లేదని చెప్పినా.. సరేనని వదిలేయడం అనేది సాధారణంగా మనం సినిమాల్లో చూస్తుంటాం కదా.. మా ఇంట్లో అచ్చం ఇలానే జరుగుతుంది. నేను ఫెమినిస్ట్‌గా మాట్లాడటం లేదు.. కానీ మా ఇంట్లో మేమిద్దరం సమానమే. సినిమా నిర్మాణం నుంచి పిల్లల పెంపకం, సెలవుల్లో తిరగడం వరకు ప్రతి విషయంలోనూ మేం కలిసే నిర్ణయం తీసుకుంటాం. ఒకరి ఎదుగుదలను చూసి మరొకరం ఆనందించడమే మాకు అత్యంత ఇష్టమైన పని" అని ఆమె చెప్పారు.ఆఫ్‌స్క్రీన్, ఆన్‌స్క్రీన్‌లో హిట్ జోడీ అయిన సూర్య, జ్యోతిక తమిళంలో 'పూవెల్లం కేట్టుప్పార్' మొదలుకొని ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో కలిసి నటించి, మెప్పించారు. ఈ సినిమా సమయంలోనే వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. 2006 సెప్టెంబర్ 11న వివాహం చేసుకున్నారు.

# 'బిగ్‌బాస్'.. క్రమశిక్షణ లేని ప్రవర్తనను అంగీకరించను: నాగార్జున



బుల్లితెర రియాలిటీ షో 'బిగ్‌బాస్' తెలుగు సీజన్-10 ముస్తాబవుతోంది. దీనికి సంబంధించిన ప్రోమో షూటింగ్‌ను టాలీవుడ్ అగ్రకథానాయకుడు నాగార్జున ఇటీవల పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆయన ముచ్చటించారు. బిగ్‌బాస్ విశేషాలతో పాటు తన 100వ చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు."ప్రోమో షూట్ చాలా బాగా జరిగింది. గత కొన్నేళ్లుగా నేను ఈ షోను హోస్ట్ చేస్తున్నా. ఇది పదో సీజన్ కావడంతో సరికొత్తగా, మరింత ఉన్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నాం. ఇతరుల ప్రవర్తనను నిర్ణయించడం, సూచనలు చేయడం నాకిష్టం ఉండదు. అందుకే మొదటి రెండు సీజన్లలో కొంచెం ఇబ్బందిగా అనిపించింది. ఆ తర్వాత షో ఫార్మాట్ అలవాటైంది. గత సీజన్ సూపర్ హిట్ కావడంతో, ప్రేక్షకుల డిమాండ్ మేరకు ఈసారి ఫిజికల్ టాస్కులు మరింత కఠినంగా ఉండబోతున్నాయి. షోలో కంటెస్టెంట్లు హద్దులు దాటి, క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తే అస్సలు అంగీకరించను" అని నాగార్జున పేర్కొన్నారు ఇక తన 100వ సినిమా గురించి నాగార్జున అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను అభిమానుల ముందుకు తీసుకొస్తామని వెల్లడించారు.




# నేను సెంటిమెంట్స్ నమ్మను: వరుణ్ తేజ్


వరుణ్.. రితికా నాయక్ జంటగా నటించిన చిత్రం 'కొరియన్ కనకరాజు' మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా భీమవరంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ మాట్లాడుతూ.. తాను సెంటిమెంట్స్ నమ్మనని చెప్పారు. కానీ, 2018లో 'తొలిప్రేమ' సినిమా ఈవెంట్‌కు భీమవరం వచ్చానని.. మళ్లీ ఇప్పుడు ఈ చిత్రం కోసం వచ్చినట్లు చెప్పారు. ఆ సినిమాలానే 'కొరియన్ కనకరాజు' కూడా తన కెరీర్‌లో నిలిచిపోతుందని అన్నారు.

# 'రామాయణ' సినిమాను 'ఆదిపురుష్'తో పోల్చొద్దు: రచయిత మనోజ్



బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి వార్తల్లో నిలుస్తోంది. గతంలో వచ్చిన 'ఆదిపురుష్'తో ఈ చిత్రాన్ని పోలుస్తూ కొందరు పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఆదిపురుష్' రచయిత మనోజ్ దీనిపై మాట్లాడారు. 'రామాయణ'లో రావణుడి పాత్ర పోషించిన యశ్‌పై ప్రశంసలు కురిపించారు."యశ్ చాలా మంచి నటుడు. అందులో ఎలాంటి సందేహం లేదు. మన భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే ఏ సినిమాకైనా నా పూర్తి మద్దతు ఉంటుంది. 'రామాయణ' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చొద్దు. అది ప్రేక్షకుల అంచనాలను అందుకోలేపోయింది. ఆ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. అయితే, 'ఆదిపురుష్' సంగీతం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఇప్పుడు రామాయణ మ్యూజిక్ కూడా హిట్ కావడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని మనోజ్ తెలిపారు.రణ్‌బీర్ కపూర్ రాముడిగా కనిపించనున్న రామాయణ చిత్రం రెండు భాగాలుగా రానుంది. ఇప్పటికే రెండో భాగం కూడా 50 శాతం షూటింగ్ పూర్తయినట్లు రణ్‌బీర్ తెలిపారు. రామాయణ లాంటి గొప్ప కథను 10 భాగాలు తీయొచ్చని రెండు భాగాల్లోనే నితీశ్ తివారీ అద్భుతంగా తెరకెక్కిస్తున్నారని ప్రశంసించారు. దీపావళికి ఈ సినిమా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# ఒకే ఏడాది రెండు పార్ట్‌లు.. కొత్త సినిమా ప్రకటించిన సందీప్ కిషన్




యంగ్ హీరో సందీప్ కిషన్ కొత్త ప్రయోగం చేయనున్నారు. 'సూపర్ సుబ్బు'లో టీచర్‌గా ప్రేక్షకులను అలరించిన ఆయన.. ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఫాంటసీ అడ్వెంచర్ సినిమాతో రానున్నట్లు తెలిపారు. రెండు భాగాలుగా ఈ చిత్రం విడుదల కానుంది.యుగంధర్ ముని దర్శకత్వంలో రానున్న ఈ సినిమాకు 'కరికాల - ఎ మ్యాజికల్ వరల్డ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రెండు భాగాల విడుదల తేదీలను తెలుపుతూ నేడు ఫస్ట్‌లుక్‌ను పంచుకున్నారు. మొదటి పార్ట్ వచ్చే ఏడాది జులై 2న విడుదల కానుండగా.. 2027 అక్టోబర్ 28న రెండో భాగం ప్రేక్షకుల ముందుకు రానుంది. పాన్ ఇండియా స్థాయిలో దీన్ని తెరకెక్కిస్తున్నట్లు టీమ్ తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను పంచుకోనున్నారు.ప్రస్తుతం 'సిగ్మా' విడుదల కోసం సందీప్ కిషన్ ఎదురు చూస్తున్నారు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. జులై 31న 'సిగ్మా' విడుదల కావాల్సి ఉండగా కొన్ని కారణాల వల్ల ఇది వాయిదా పడింది.